

బెట్టింగ్‌లతో జీవితాలు నాశనం

- 112, 100కి సమాచారం ఇవ్వండి
- 63099 90800కూ కాల్ చేయొచ్చు
- వివరాలు గోప్యంగా ఉంచుతాం
- ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌ల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని యువతకు ఎస్పీ కె.వి. మహేశ్వరరెడ్డి సూచించారు. ఐపీఎల్ సీజన్ వేళ.. యువత బెట్టింగ్‌లకు పాల్పడి డబ్బులు సంపాదించవచ్చన్న ఆలోచనతో అప్పులపాలు కావద్దని హెచ్చరించారు. శనివారం 'ఆంధ్రజ్యోతి'తో ఆయన మాట్లాడుతూ.. 'ఆన్‌లైన్‌లో కానీ, ఆఫ్‌లైన్‌లో కానీ ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సమాచారం తెలిస్తే 112, లేదా 100, లేదా 6309990800 నెంబర్లకు సమాచారం ఇవ్వాలి. సమాచారం ఇచ్చేవారి వివరాలు గోప్యంగా ఉంచుతాం. బెట్టింగ్‌లను అడ్డుకోవడమంటే ప్రస్తుత దశలో ఓ కుటుంబాన్ని ప్రాణాలతో కాపాడటమే. బెట్టింగ్ యాప్‌లపై, పాత నేరస్థులు, అనుమానితులపై ప్రత్యేక దృష్టి సారించాం. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా బెట్టింగ్ యాప్‌లకు సహకరించే వారిపై పోలీసు శాఖ చర్యలు తీసుకుంటోంది. డీజీపీ ఆదేశాల మేరకు జిల్లాలో యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లకు పాల్పడే వారి వివరాలు సేకరిస్తున్నాం. గతంలో క్రికెట్ బెట్టింగ్ కేసుల్లో పట్టుబడిన వారిపై కూడా ప్రత్యేక నిఘా ఉంచాం. చట్టవ్యతిరేకంగా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠినచర్యలు తప్పవు. బెట్టింగ్‌లకు బానిసై అప్పులు చేసి ఆర్థిక సమస్యలు ఎదుర్కోలేక యువత ఆత్మహత్యలకు పాల్పడిన ఘటనలు గతంలో పోలీసులు గుర్తించినట్లు నా దృష్టికి వచ్చాయి. ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నాం. క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై రౌడీషీట్లు తెరుస్తామ'ని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా పిల్లల తీరుపై శ్రద్ధ వహించాలని సూచించారు.

పందెం కాస్తే.. పోతాయ్!

- క్రికెట్ బెట్టింగ్ వలలో యువత
- ఆన్‌లైన్ యాప్‌లతోనూ నష్టపోతున్న వైనం
- జిల్లాలో ఎంతోమంది బాధితులు
- కొన్ని ఘటనలే పోలీసుస్టేషన్ వరకు..
- ఇంకా వెలుగులోనికి రాని కేసులెన్నో
- అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు





హరిపురం/ కవిటి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): క్రికెట్ క్రీడాభిమానులను ఉర్రూతలూగించే ఐపీఎల్ (ఇండియన్ ప్రీమియర్ లీగ్) శనివారం ప్రారంభమైంది. రెండు నెలలకుపైగా సాగే ఈ సంగ్రామాన్ని కొందరు వినోదం కోసం చూస్తుంటారు. మరికొందరు సులభంగా ఆదాయం సంపాదించే వనరుగా భావిస్తున్నారు. బంతి బంతికీ బెట్టింగ్ పెట్టి డబ్బు సంపాదించాలని అత్యాశ పడుతున్నారు. ఈ ఊబిలో చిక్కుకొని చేసిన అప్పులు తీర్చలేక చివరకు ఆత్మహత్యకు పాల్పడుతున్న ఘటనలు గతంలో ఎన్నో చోటుచేసుకున్నాయి. ప్రధానంగా యువతే ఇందులో బాధితులుగా మారుతున్నారు. గతంలో ఐపీఎల్ క్రికెట్ క్రీడలకు సంబంధించి పట్టణాల్లోనే సాగే బెట్టింగ్‌లు.. నేడు సెల్‌ఫోన్ పుణ్యమా అని పల్లెలకూ పాకింది. కొన్నేళ్ల కిందట అందరూ ఓ చోట కూర్చుని పందేలు కాసేవారు. తర్వాత కాలంలో పెద్ద మొత్తాల్లో బెట్టింగ్‌లు జరిగేటప్పుడు బుకీల పేర్లు వినిపించేవి. ప్రస్తుతం చాలావరకు ఆన్‌లైన్ లోనే ఐపీఎల్ మ్యాచ్‌ల బెట్టింగ్‌లు జరుగుతున్నాయి. యువత పలు యాప్‌ల్లో పందేలు కాస్తూ అప్పుల వలయంలో చిక్కుకుంటున్నారు. అప్పులు తీర్చేందుకు ఆస్తులు అమ్మి.. జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

అధిక మొత్తానికి ఆశపడి..

జిల్లాలో కొంతమంది యువకులు బెట్టింగ్ యాప్‌ల మాయలో పడి.. కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పు చేసి పెట్టుబడి పెడుతున్నారు. తక్కువ పెట్టుబడికి అధిక మొత్తం వస్తుందని ఆశ పడి ఆన్‌లైన్‌లోని యాప్‌ల ద్వారా బెట్టింగ్‌లు కాస్తున్నారు. ప్రారంభంలో రూపాయికి రూపాయి లాభం రావడంతో.. క్రమేపీ అధికమొత్తంలో పెట్టుబడి పెడుతున్నారు. ఆన్‌లైన్‌లోనే నగదు బదిలీ చేస్తున్నారు. కొంతకాలం తర్వాత నష్టాలు ఎదుర్కొని.. తాము మోసపోయామని గ్రహించి లబోదిబోమంటున్నారు. పెట్టుబడి సొమ్ము పోవడమే కాకుండా, బకాయి ఉన్నట్టు యాప్‌ల బుకీల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్ తట్టుకోలేక సతమతమవుతున్నారు. ఈక్రమంలో పరువు పోయిందనే ఉద్దేశంతో కొంతమంది ఆత్మహత్యకు పాల్పడుతున్నారు. యువత ఈజీమనీకి అలవాటు పడటంతోనే ఇలాంటి పరిస్థితులు ఎదురవుతున్నాయని పలువురు పేర్కొంటున్నారు. పరువు పోతుందనే ఉద్దేశంతో ఈ వ్యవహారంపై కొంతమంది పోలీసులకు ఫిర్యాదు (మిగతా 6వ పేజీలో..)

- సోంపేట మండలానికి చెందిన ఒక యువకుడు మందస మండలంలోని ఓ ప్రభుత్వ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ యువకుడు బెట్టింగ్‌లకు అలవాటు పడి జీతం డబ్బులు పోగొట్టుకున్నాడు. స్నేహితుల నుంచి, ఆన్‌లైన్ యాప్‌ల్లో రూ.లక్షల్లో అప్పులు తీసుకొని మరీ బెట్టింగ్‌ల్లో పెట్టాడు. చివరకు అప్పుల బాధ తట్టుకోలేక కొన్నాళ్ల కిందట పరారీ అయ్యాడు. కుటుంబ సభ్యులు భూమి అమ్మి ఆ అప్పును తీర్చుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.
- పలాస ప్రాంతానికి చెందిన డిగ్రీ చదువుతున్న యువకుడు ఆన్‌లైన్ బెట్టింగులు, క్రికెట్ గేమ్స్ పందేలకు బానిసై అప్పుల పాలయ్యాడు. అప్పులు తీర్చేందుకు యాప్‌ల ద్వారా లోన్‌లు తీసుకుని మరింత నష్టాల ఊబిలో కూరుకుపోయాడు. ఈ విషయం తల్లిదండ్రులకు తెలిసిపోవడంతో.. ఆత్మహత్య చేసుకున్నాడు. సెల్ఫీ వీడియో తీసుకుని తనలా ఎవరూ బెట్టింగ్‌లకు బానిస కావద్దని, తనను క్షమించాలని తల్లిదండ్రులను వేడుకున్నాడు.
- పలాస, మందస మండలాల మధ్య ఓ రెస్టారెంట్ నిర్వాహకుడు గత ఐపీఎల్‌లో రూ.లక్షల్లో బెట్టింగ్‌లకు పాల్పడ్డాడు. ఐదేళ్లపాటు కష్టపడి కూడబెట్టిన డబ్బు మొత్తం బెట్టింగుల్లో పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడు. రెస్టారెంట్ అమ్మినా అప్పులు తీరకపోవటంతో భూమి, విలువైన సామగ్రి కూడా విక్రయించాడు. భార్య, పిల్లలను వదిలి పరారయ్యాడు. దీంతో గత్యంతరం లేక భార్య, పిల్లలు మరో రెస్టారెంట్‌లో కూలీలుగా మారారు.

- కవిటికి చెందిన ఓ యువకుడు.. ఓ వ్యాపారి వద్ద గుమస్తాగా చేరాడు. నమ్మకంగా ఉండడంతో ఆ వ్యాపారి బ్యాంకు లావాదేవీలు అప్పగించాడు. అదే అదునుగా ఆ యువకుడు కొంతమొత్తాన్ని ఆన్‌లైన్ యాప్ బెట్టింగ్‌ల్లో పెట్టి నష్టపోయాడు. బ్యాంకు లావాదేవీల్లో తేడాలు వచ్చినట్టు వ్యాపారి గుర్తించి.. ఆ యువకుడిని నిలదీశాడు. దీంతో కుటుంబ సభ్యులు కొంత స్థలాన్ని అమ్మి.. ఆ వ్యాపారికి అప్పు తీర్చారు.
- కవిటి పంచాయతీకి చెందిన ఒక వ్యక్తి రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. ఆన్‌లైన్ యాప్‌లో పెట్టుబడి పెట్టి కొన్నిరోజుల వరకు బాగానే లాభాలు సంపాదించాడు. చుట్టుపక్కల వారి నుంచి కూడా సొమ్ము సేకరించి.. స్థానికంగా ఓ కంప్యూటర్ కేంద్రం ద్వారా ఆన్‌లైన్ పెట్టుబడుల కథ నడిపాడు. చివరకు లాభాలు లేకపోగా.. నష్టం ఎదురవడంతో అప్పులపాలై బాధితులంతా లబోదిబోమంటున్నారు.

పందేల జోలికెళ్లొద్దు



ఐపీఎల్ పోటీలు వినోదాత్మకంగా సాగాలి తప్ప.. పందేలు జోలికి పోకూడదు. బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి. ఒక్కసారి ఆ ఊబిలో దిగితే చాలు.. పైకిరావటం కష్టం. ఇలాంటి యాప్‌లు, పందేలు కాస్తే కఠినచర్యలు తప్పవు. యువత మరింత జాగురకతతో వ్యవహరించాలి.

- వెంకట అప్పారావు, డీఎస్పీ, కాశీబుగ్గ

సమాచారం

గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

ఎచ్చెర్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో ప్రవేశానికి నిర్వహించనున్న పరీక్ష వాయిదా పడినట్టు ఎచ్చెర్ల, దుప్పలవలస గురుకుల పాఠశాలల ప్రిన్సిపాల్స్ బి.లక్ష్మి, బి.బుచ్చిరాజు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఏప్రిల్ 6న జరగాల్సిన ఈ పరీక్ష అనివార్య కారణాల వల్ల ఏప్రిల్ 13వ తేదీకి వాయిదా పడిందన్నారు. ఏప్రిల్ 13న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ఐదో తరగతి, మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు ఇంటర్‌లో ప్రవేశానికి పరీక్ష జరుగుతుందన్నారు. ఈ మార్పును విద్యార్థులు గమనించాలని కోరారు.

బీసీ రుణాల దరఖాస్తు గడువు పెంపు

శ్రీకాకుళం కలెక్టరేట్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాల మంజూరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 25 వరకూ గడువు పొడిగించినట్టు బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే కాపు సామాజికవర్గాలకు సంబంధించి రుణాల మంజూరు కోసం దరఖాస్తుదారుల గరిష్ఠ వయోపరిమితిని 50 నుంచి 60 ఏళ్లకు పెంచామన్నారు. అంటే 21 నుంచి 60 ఏళ్ల వయసుగల వారు అర్హులని స్పష్టం చేశారు.

చూచితిరా.. వైఫల్యం!



కుప్పిలి మోడల్ స్కూల్

- పదో తరగతి పరీక్షల్లో కాపీయింగ్
- ఉపాధ్యాయులే సహకరిస్తున్న వైనం
- కొంతమంది తీరుతో విద్యాశాఖకు అప్రతిష్ఠ
- విద్యార్థుల భవితకు తప్పని ముప్పు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పక్కాగా ఏర్పాట్లు చేయండి. ఎక్కడా లోపాలు వెలుగుచూడనివ్వొద్దు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరి సెల్‌ఫోన్లు కేంద్రాలకు అనుమతించవద్దు. సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించండి. సోషల్ మీడియాలో పేపర్ లీకేజీ అంటూ ప్రచారం చేసేవారిపై నిఘా పెట్టండి. ఎట్టి పరిస్థితుల్లో ప్రభుత్వానికి తలవంపులు తీసుకొచ్చే ఏ చర్యను ప్రోత్సహించవద్దు.

-ఈ నెల 12న రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధికారులకు చేసిన ఆదేశాలివి

- ఈ నెల 19న రణస్థలం మండలం పైడిభీమవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీసీ కెమెరాలు చోరీకి గురయ్యాయి. ఇక్కడ 17 గదుల్లో పరీక్షలకు ఏర్పాట్లు చేశారు. అందులో భాగంగా నిఘా కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే బుధవారం హిందీ పరీక్ష పూర్తయిన తర్వాత **13 సీసీ కెమెరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు.** దీంతో చీఫ్ సూపరింటెండెంట్ జగన్నాథరావు జే.ఆర్.పురం పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు.



- ఈ నెల 21న ఎచ్చెర్ల మండలం కుప్పిలి మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన ఐదుగురు విద్యార్థులు డిబార్ అయ్యారు. సుమారు 400 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్న ఈ కేంద్రంలో పెద్ద ఎత్తున చూచిరాతలు జరుగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు నాలుగు స్క్వాడ్ బృందాలు శుక్రవారం తనిఖీలు చేపట్టాయి. అయితే అక్కడ ఉపాధ్యాయులే మాస్ కాపీయింగ్‌కు సూత్రధారులని తేలింది. దీంతో ప్రభుత్వం 15మంది ఉపాధ్యాయులపై సస్పెన్షన్ వేటు వేసింది.

రణస్థలం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో విద్యాశాఖ పనితీరు అపహాస్యంగా మారింది. పదోతరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణత, ట్రిపుల్ ఐటీ ర్యాంకుల కోసం అడ్డదారులు తొక్కుతుండడం విస్తుగొలుపుతోంది. ముఖ్యంగా విద్యార్థుల భవితను తీర్చిదిద్దాల్సిన కొందరు ఉపాధ్యాయులే ఈ అడ్డగోలు వ్యవహారానికి వత్తాసు పలకడం సిగ్గుచేటు. జిల్లాలోని కుప్పిలిలో చూసిరాతలు, పైడిభీమవరంలో (మిగతా 6వ పేజీలో..)

కుప్పిలి కాపీయింగ్‌లో ఆరుగురిపై కేసు నమోదు

కుప్పిలి మోడల్ స్కూల్‌లో జరిగిన పదో తరగతి పరీక్షల వ్యవహారంలో ఆరుగురిపై కేసు నమోదు చేశామని ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఇంగ్లిష్ పరీక్ష జరుగుతుండగా.. డీఈవో ఎస్.తిరుమల చైతన్య ఆధ్వర్యంలో నాలుగు బృందాలు ఆకస్మిక తనిఖీ నిర్వహించి చూచిరాతలకు ప్రోత్సహించిన 15 మందిపై సస్పెన్షన్ వేటు విధించారు. ఈ సంఘటనపై డీఈవో ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయులు ఎం.కనకరాజు (ఎస్ఏ ఇంగ్లిష్, బుడగట్లపాలెం), ఎస్.కృష్ణ(ఎస్ఏ హిందీ, కొయ్యాం), పి.నాగేశ్వరరావు (ఎస్ఏ మేథ్స్, కుప్పిలి), కె.కామేశ్వరరావు (ఎస్ఏ, హిందీ, కుప్పిలి), జె.పద్మకుమారి (హెచ్‌ఎం, జడ్పీహెచ్‌ఎస్, కుప్పిలి), బి.కృష్ణ కిశోర్ (బోధనేతర సిబ్బంది, కుప్పిలి)పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు. వీరిపై ఛీటింగ్, మాల్‌ప్రాక్టీస్ 318/4, 61/2, 3/5, 97,98 తదితర సెక్షన్లను నమోదు చేశామన్నారు. కేసు దర్యాప్తులో మరికొన్ని పేర్లు చేరే అవకాశం ఉందన్నారు.

- కొన్నేళ్లుగా ఈ కేంద్రంలో పరీక్షల నిర్వహణపై విమర్శలు ఉన్నాయి. ఉపాధ్యాయులే స్వయంగా మాల్‌ప్రాక్టీస్‌కు సహకరించడంతో విద్యార్థుల తల్లిదండ్రులు నివ్వెరపోతున్నారు. ఇలాంటి సంఘటనల వల్ల కష్టపడి చదివిన విద్యార్థుల భవిత ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్ స్కూల్‌లో పరీక్ష జరుగుతుండగా, ఇక్కడికి సమీపంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో స్లిప్పులు తయారు చేశారని డీఈవో తనిఖీలో వెల్లడైంది. ఇలాంటి కేంద్రాలు జిల్లాలో మరి కొన్ని ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. కుప్పిలి వ్యవహారంపై విద్యాశాఖ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్ రంగంలోకి దిగినట్టు విద్యాశాఖ వర్గాల ద్వారా తెలిసింది.

మీలో ఓ 'అగ్నివీర్'డు

- నోటిఫికేషన్ విడుదల
- ఏప్రిల్ 10లోగా దరఖాస్తుకు అవకాశం
- జూన్‌లో ఆన్‌లైన్ రాత పరీక్ష
- తొలిసారిగా తెలుగు భాషలో..
- యువతలో ఆనందం

6లో

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరందించాలి

- మంత్రి అచ్చెన్నాయుడు

8లో

మళ్లీ వచ్చాయి... మన మట్టి పాత్రలు

- తాగునీటి నిల్వకు ఇవే ఆధారం
- వేసవిలో మంచి డిమాండ్

6లో

క్షయరహిత సమాజానికి కృషి

- డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ
- జిల్లాలో 3,428 కేసులు

7లో



ఇచ్ఛాపురం ఎంవీఐ కార్యాలయం వద్ద ఆటోడ్రైవర్ల నిరసన (ఫైల్)

'రవాణా' భారం!

- ఫిట్‌నెస్ పరీక్షల కేంద్రం ఎత్తివేత
- నిలిచిన డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియ
- జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో కుదింపు
- శ్రీకాకుళం వెళ్లాలంటే వాహనదారులకు ఇక్కట్లు

- ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన శ్రీరాములురెడ్డికి ట్రాక్టరు ఉంది. పట్టణంలోని ఫిట్‌నెస్ కేంద్రంలో సామర్థ్య పరీక్షలు నిర్వహించి ధ్రువపత్రం అందించేవారు. కానీ ఇప్పుడు ఫిట్‌నెస్ కేంద్రాన్ని శ్రీకాకుళం రవాణా శాఖ కార్యాలయంలో కుదించారు. దీంతో ఇచ్ఛాపురం నుంచి 150 కిలోమీటర్ల దూరంలోని శ్రీకాకుళం వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఒక్క ఫిట్‌నెస్ పరీక్షకు రూ.5వేలు ఖర్చవుతోందని వాపోతున్నారు.

ఇచ్ఛాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వేలాది మంది వాహనదారులు ఫిట్‌నెస్ పరీక్షల కోసం ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు జారీ కాక అన్ని నియోజకవర్గాల ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. గతంలో రెవెన్యూ డివిజన్ల వారీగా రవాణా శాఖ కార్యాలయాలు ఉండేవి. టెక్కలి డివిజన్‌కు సంబంధించి ఇచ్ఛాపురంలో కార్యాలయం ఉండేది. కాగా రవాణా శాఖలో (మిగతా 6వ పేజీలో..)

అనధికారికంగా ఇసుక ర్యాంపు

- భారీగా ఒడిశాకు నిల్వల తరలింపు
- పట్టించుకోని అధికారులు

కొత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): అక్కడ ఇసుక తవ్వకాలు, స్టాక్ పాయింట్‌కు ప్రభుత్వ అనుమతులు లేవు. కానీ అధికారుల కళ్లుగప్పి.. ర్యాంప్‌ను అక్రమంగా నిర్వహిస్తూ ఇసుకను ఒడిశా ప్రాంతాలకు తరలించి అక్రమ వ్యాపారులు దోచుకుంటున్నారు. వివరాల్లోకి వెళితే.. కొత్తూరు మండలంలో నివగాం, ఆకులతంపరలో మాత్రమే ఇసుక ర్యాంపు, స్టాక్ పాయింట్‌కు ప్రభుత్వం అనుమతిచ్చింది. కానీ మండలంలోని పొనుటూరు, బంకి, రాయల కొండల ప్రాంతంలో వంశధార నది నుంచి ఇసుకను యంత్రాలతో రాత్రివేళ తవ్వి ట్రాక్టర్లు, లారీల్లో లోడ్ చేస్తున్నారు. బండి కొండల ప్రాంతంలో స్టాక్‌పాయింట్‌ను అనధికారికంగా ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఒడిశాకు రోజూ పదుల సంఖ్యల లారీలు, ట్రాక్టర్లల్లో ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఆంధ్రా నుంచి ఒడిశాకు ఇసుక తరలించరాదని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను తుంగలో తొక్కుతున్నారు. దిమిలి, రాయల, మాకవరం, పొనుటూరు గ్రామాలకు చెందిన కొంతమంది ఈ ఇసుక దందాను నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఇసుక అక్రమాలు తెలిసినా.. రెవెన్యూ అధికారులు, పొనుటూరు సచివాలయ సిబ్బంది పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై కొత్తూరు తహసీల్దార్ రవిచంద్ర వద్ద ప్రస్తావించగా అక్రమ స్టాక్‌పాయింట్ ఉన్నట్లు గుర్తించామన్నారు. ఇసుక పాయింట్‌ను సీజ్ చేసి, అక్రమార్కులపై కేసులు నమోదుకు సిఫారసు చేస్తామని తెలిపారు.



బంకి రాయల కొండల్లో ఇసుక అక్రమ స్టాక్ పాయింట్

● నియామక ప్రక్రియ ప్రారంభం ● నోటిఫికేషన్ విడుదల
● ఏప్రిల్ 10లోగా దరఖాస్తుకు అవకాశం
● జూన్‌లో ఆన్‌లైన్ రాత పరీక్ష
● తొలిసారిగా తెలుగు భాషలో..
● నిరుద్యోగ యువతలో ఆనందం


సురంగి రాజా మైదానంలో రన్నింగ్ ప్రాక్టీస్ చేస్తున్న యువకులు..

మీలో ఓ అగ్నివీరుడు

ఇచ్ఛాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని నిరుద్యోగులకు మరో సువర్ణావకాశం. ఆర్మీలో నియామకానికి సంబంధించి అగ్నివీర్ నోటిఫికేషన్ విడుదలైంది. అభ్యర్థులు ఏప్రిల్ 10లోగా దరఖాస్తు చేసుకోవచ్చు. జూన్‌లో ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. అందులో అర్హత సాధించిన వారికి ఫిజికల్ ఫిట్‌నెస్ పరీక్ష నిర్వహిస్తారు. విశాఖ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ఆఫీస్ పరిధిలో ఆరు ఉమ్మడి జిల్లాల అభ్యర్థులకు విశాఖలోనే ఫిజికల్ ఫిట్‌నెస్, ఈవెంట్స్ పరీక్షలు జరగనున్నాయి. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్/స్టోర్ కీపర్, టెక్నికల్, ట్రేడ్స్‌మెన్‌ను భర్తీ చేయనున్నారు. ఈసారి ఎంపిక ప్రక్రియలో మార్పులు చేశారు. ఆన్‌లైన్ పరీక్షను ప్రాంతీయ భాషల్లో పూర్తి చేసుకునే వెసులుబాటు కల్పించారు. అంటే తెలుగులో పరీక్ష రాసుకోవచ్చన్న మాట.

● వేతనాలు ఇలా..

అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైతే తొలి ఏడాది నెలకు రూ.30 వేలు, రెండో ఏడాది నెలకు రూ.33 వేలు, మూడో ఏడాది రూ.36,500, నాలుగో ఏడాది నెలకు రూ.40 వేలు వేతనంగా అందిస్తారు. నాలుగేళ్లకు సేవానిధి ప్యాకేజీని అందిస్తారు. వార్షిక సెలవులు 30 వరకూ ఉంటాయి. ఆరోగ్య సమస్యలను బట్టి సిక్ లీవ్ ఇస్తారు.



నాలుగేళ్ల పాటు సర్వీసులో ఉన్నప్పుడు రిస్క్ అండ్ హార్డ్‌షిప్, రేషన్, డ్రెస్, ట్రావెల్ అలవెన్స్‌లు అందిస్తారు. నాలుగేళ్ల పాటు రూ.48 లక్షలకు లైఫ్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తారు. నాలుగేళ్ల సేవకు గాను వీరికి అగ్నివీర్ స్కిల్ సర్టిఫికెట్ అందిస్తారు. ఇంటర్ సమాన స్థాయి సర్టిఫికెట్ అందిస్తారు. వీరికి పింఛన్, గ్రాట్యుటీ వర్తించవు. ఎక్స్ సర్వీస్‌మెన్‌గా గుర్తించరు. కరువు భత్యం, మిలటరీ సర్వీస్ పే వీరికి వర్తించదు. ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) ఉండదు. నాలుగేళ్ల వ్యవధి పూర్తి చేసుకున్న అగ్నివీర్ బ్యాచ్ నుంచి 25 శాతం మందిని ఆర్మీలో రెగ్యులర్ ఉద్యోగులుగా తీసుకుంటారు. ఇందుకోసం నాలుగేళ్లలో చూపిన ప్రతిభను ప్రామాణికంగా తీసుకుంటారు. ఇలా ఎంపికైన వారు 15 ఏళ్ల పాటు ఆర్మీ సర్వీసులో కొనసాగవచ్చు.


లాంగ్ జంప్ ప్రాక్టీస్ చేస్తున్న యువకుడు



సేవానిధికి ఇలా జమ..

సేవానిధిలో భాగంగా ప్రతి నెలా అందుకునే మొత్తంలో 30 శాతం కార్పస్ ఫండ్‌కి జమ చేస్తారు. మొదటి నెల పొందే రూ.30 వేల వేతనంలో రూ.9 వేలను కార్పస్ ఫండ్‌కు బదలాయిస్తారు. అగ్నివీర్‌కు కేవలం రూ.21 వేలు మాత్రమే అందుతుంది. రెండో ఏడాది వచ్చేసరికి రూ.23,100 వేతనం రూపంలో అందుతుంది. రూ.9,900 నిధికి జమ అవుతుంది. మూడో ఏడాదికి రూ.25,500 వేతనంగా అందుతుంది. రూ.10,950 నిధికి వెళుతుంది. నాలుగో ఏడాదికి వచ్చేసరికి వేతనంగా రూ.28 వేలు, నిధికి రూ.12 వేలు వెళతాయి. ఇలా నాలుగేళ్లలో అగ్నివీర్ సేవా నిధికి రూ.5.02 లక్షలు పోగవుతుంది. ఇంతే మొత్తం ప్రభుత్వం జమచేస్తుంది. ఈ లెక్కన ఈ నాలుగేళ్లలో రూ.10.04 లక్షలు అందుతాయన్న మాట. దీనికి వడ్డీ మొత్తం కలిపి అందిస్తారు. అగ్నివీర్‌లకు బ్యాంకు రుణం అందే సదుపాయం కల్పిస్తారు.

వేర్వేరుగా ప్రశ్నపత్రాలు..

దరఖాస్తు చేసుకున్న పోస్టును బట్టి ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో ఎక్కువ విభాగాలకు జనరల్ నాలెడ్జ్, జనరల్ సైన్స్, మ్యాథ్స్, లాజికల్ రీజనింగ్‌లో ప్రశ్నలు ఉంటాయి. కొన్ని పోస్టులకు కంప్యూటర్ సైన్స్, జనరల్ ఇంగ్లీష్, లాజికల్ రీజనింగ్, ఫిజిక్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీల్లోనూ ప్రశ్నలు ఉంటాయి. సాధారణంగా 50 ప్రశ్నలు ఉంటాయి. వీటిని గంటలో పూర్తి చేయాల్సి ఉంటుంది. కొన్ని పోస్టులకు మాత్రం 100 వరకూ ప్రశ్నలు ఉంటాయి. రెండు గంటల్లో పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇండియన్ ఆర్మీ వెబ్‌సైట్‌లో గత పరీక్షల ప్రశ్నపత్రాలు ఉంటాయి. వాటిని చూసి సాధన చేస్తే చాలా మంచిది. క్లర్క్, స్టోర్ కీపర్, టెక్నికల్ పోస్టులకు మాత్రం టైపింగ్ కీలకం. నిమిషానికి 30 ఆంగ్ల పదాలు టైప్ చేయాల్సి ఉంటుంది.

మార్కులు ఎలాగంటే...

అన్నిపోస్టులకు ఫిజికల్ టెస్టులో అర్హత సాధించడం తప్పనిసరి. అందులో భాగంగా 1.6 కిలోమీటర్లు 5 నిమిషాల 30 సెకన్లలో పూర్తి చేస్తే 60 మార్కులు, 5 నిమిషాల 31 సెకన్ల నుంచి 45 సెకన్ల లోపు పూర్తి చేస్తే 48 మార్కులు ఇస్తారు. కనీసం ఆరు పుల్ అప్స్ తీయాలి. 6 తీసిన వారికి 16 మార్కులు, 7 తీస్తే 21, ఎనిమిది పుల్‌అప్స్ తీస్తే 27, తొమ్మిదికి 33, 10 తీస్తే 40 మార్కులు పొందవచ్చు. 9 అడుగుల పాటు లాంగ్ జంప్ వేస్తే అర్హత సాధిస్తారు. జిగ్‌జాగ్ బ్యాలెన్స్‌లో అర్హత సాధించాలి. అనంతరం ఫిజికల్ మెజర్‌మెంట్, మెడికల్ పరీక్షలు ఉంటాయి. వీటిన్నింటిలో విజయవంతమైతే శిక్షణకు ఎంపిక చేస్తారు.

● వారికి బోనస్ పాయింట్లు..

కొన్నివర్గాల వారికి బోనస్ పాయింట్లు ఉంటాయి. ఎక్స్ సర్వీస్‌మెన్ పిల్లలకు 20 బోనస్ పాయింట్లు ఉంటాయి. క్రీడల్లో రాణించే వారికి వారి స్థాయిని బట్టి గరిష్ఠంగా 20 మార్కులు కేటాయించారు. ఎన్‌సీసీ-ఎ ఉంటే 5, బి ఉంటే 10, సి ఉంటే 20, రిపబ్లిక్ పరేడ్ లో పాల్గొంటే గరిష్ఠంగా 25 మార్కులు పొందవచ్చు. పదో తరగతి తరువాత రెండేళ్ల ఐటీఐకి 20, రెండు లేదా మూడేళ్ల డిప్లమోకు 30 మార్కులు బోనస్‌గా దక్కుతాయి. ఇంటర్ తరువాత ఏడాది ఐటీఐకి 30, రెండేళ్లయితే 40 మార్కులు పొందవచ్చు. ఇంటర్ తరువాత డిప్లమో చేసేవారికి 50 మార్కులు పొందవచ్చు. ఈ బోనస్ మార్కులు సాధారణంగా టెక్నికల్ పోస్టుకు 50, మిగిలిన వారికి 25 కలుపుతారు. వీటిని పరీక్షలో సాధించిన మార్కులకు కలిపి మెరిట్ జాబితా రూపొందిస్తారు.

● సాధన చేస్తున్నా..

అగ్నివీర్ ఉద్యోగాల కోసం సాధన చేస్తున్నా. శారీరక సామర్థ్య పరీక్షలకు సంబంధించి సాధన చేయడంతో పాటు ఆన్‌లైన్ రాత పరీక్షకు ప్రిపేర్ అవుతున్నా. తొలిసారిగా తెలుగు భాషలో పరీక్ష నిర్వహిస్తుండడం శుభ పరిణామం. ప్రాంతీయ భాషలో అవకాశం కల్పించడం బాగుంది.

-సీరపు శ్రీను, ఇచ్ఛాపురం

● ఆనందంగా ఉంది..

తెలుగు భాషలో ఆన్‌లైన్ పరీక్షకు అనుమతి లభించడం ఆనందంగా ఉంది. ప్రతిరోజూ సాధన చేస్తున్నాం. రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్ ప్రాక్టీసు చేస్తున్నాం. రాత పరీక్షకు శిక్షణ పొందుతున్నాం. ముఖ్యంగా శారీరక సామర్థ్య పరీక్షకు ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నాం. కచ్చితంగా ఉద్యోగం సాధిస్తానన్న నమ్మకం ఉంది.

-రమణారెడ్డి, ఇచ్ఛాపురం

భానుడి భగభగ

● 40 డిగ్రీలకు పెరిగిన ఉష్ణోగ్రతలు
● నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న రోడ్లు

శ్రీకాకుళం అర్బన్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వేసవి కాలం ప్రారంభంలోనే భానుడు భగభగలాడిపోతున్నాడు. రోజురోజుకీ పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. జిల్లాలో రికార్డ్ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. గడిచిన పది రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు మే నెలను తలపిస్తున్నాయి. ఒక్కో రోజు 40 డిగ్రీలకు పెరుగుతున్నాయి. జిల్లాలో శ్రీకాకుళం నుంచి ఇచ్ఛాపురం వరకు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు బయటకు రావడానికి భయపడే పరిస్థితులు నెలకొంటున్నాయి. ఉదయం 7 గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. మధ్యాహ్నం ఒంటి గంటకు రోడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి. పసిపిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో చల్లని పానీయాలు, కొబ్బరినీరుకు డిమాండ్ పెరిగింది. ఓవైపు ఎండలు... మరో వైపు వేడిగాలులు వీస్తుండటంతో జిల్లా ప్రజలు ఉక్కబోతతో అల్లాడిపోతున్నారు. చిరు వ్యాపారులు కుటుంబ పోషణ కోసం తప్పనిసరి పరిస్థితుల్లో గొడుగుల నీడలో రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. పొట్ట కూటి కోసం రోడ్లపై వేషధారణ వేసే వారు మండుటెండల్లో సైతం కదలకుండా నిల్చుంటున్న దృశ్యాలు హృదయాలను కదిలిస్తున్నాయి. ఇక ఉపాధి కూలీల పరిస్థితి నిలువ నీడ లేక దారుణంగా ఉంటోంది. వీరికి నీరు.. నీడ కల్పించాలని కోరుతున్నారు.


పొట్టకూటి కోసం మండుటెండలో గాంధీ వేషధారణలో నిల్చున్న వ్యక్తి


కొబ్బరి బొండాలు, చల్లటి పానీయాల కోసం..

మళ్లీ వచ్చాయి.. మన మట్టి పాత్రలు

● మంచి నీటి నిల్వకు ఇవే ఆధారం
● వేసవిలో ఎక్కువగా డిమాండ్

శ్రీకాకుళం కల్చరల్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మట్టి కుండ.. ఒకప్పుడు ఇది లేని ఇల్లు ఉండేది కాదంటే అతిశయోక్తి కాదు. నీరు పట్టుకోవడానికి... నీటిని నిల్వ ఉంచడానికి... వంటలకు..ఇలా అన్ని అవసరాలకూ వీటినే వినియోగించే వారు. ఇక పండగల సమయాల్లో కచ్చితంగా మట్టి పాత్రల్లోనే వంటలు చేయడం జిల్లాలో ఆనవాయితీ. రాను రానూ కాలంతో పాటు వచ్చిన మార్పుల నేపథ్యంలో వీటికి ఆదరణ తగ్గింది. వీటి స్థానాన్ని స్టీలు, ఇతర లోహాలతో చేసిన సామగ్రి ఆక్రమించాయి. అయితే ఇటీవల కాలంలో మళ్లీ అక్కడక్కడా మట్టి కుండలు కనిపిస్తున్నాయి. ఇక నీటి నిల్వల కోసం కూజాలు, కడవలు మళ్లీ జనం వినియోగించడం మొదలు పెట్టారు. ఫ్రిజ్‌లో నిల్వ ఉంచిన నీటి కంటే.. మట్టి కుండలోని నీళ్ల మంచిదని నిపుణులు చెబుతుండడమే దీనికి కారణం. ముఖ్యంగా వేసవి కాలంలో వీటికి డిమాండ్ ఎక్కువగా ఉంటోంది.


అమ్మకానికి సిద్ధంగా...

ఆరోగ్యానికి...

మట్టికుండలో ఉన్న నీరు తాగడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గొంతు నొప్పి, జలుబు వంటి వాటిని నివారించవచ్చని చెబుతున్నారు. వడదెబ్బ నివారణకూ మట్టికుండలో నీరు ఉపయోగపడుతుందని అంటున్నారు.

చలివేంద్రాల్లో..

వేసవి కాలంలో అనేక ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తుంటారు. తాటాకులు, కొబ్బరి ఆకులతో పందిరి వేసి... పెద్ద మట్టికుండను ఉంచి... అందులో మజ్జిగ లేదా మంచినీటిని ఉంచి బాటసారులకు అందిస్తుంటారు. దీంతో మట్టికుండలకు గిరాకీ పెరుగుతోంది. చిన్న పట్టణాలతో పాటు పెద్ద పెద్ద నగరాల్లో కూడా మట్టి కుండలు, బిందెలు, కూజాల విక్రయాలు పెరుగుతున్నాయి. ప్రస్తుత అవసరాలు... మార్పులకు తగ్గట్టుగా వీటికి ట్యాప్‌లు బిగించి అమ్ముతుండడం గమనార్హం. ఒక్కొక్క కుండ 10, 20, 30 లీటర్ల నీరు సామర్థ్యంతో ఉంటాయి. మార్కెట్‌లో వీటి ధరలు సైజును బట్టి రూ.200 నుంచి రూ.500వరకు ఉంటున్నాయి.

ఈ కాలంలోనే విక్రయాలు అధికం..

వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండేటప్పుడు మాత్రమే మట్టి కుండల అమ్మకాలు అధికంగా ఉంటాయి. సాధారణ రోజుల్లో రోజుకు 10 కుండలు కూడా చెల్లడం కష్టం. ఎండాకాలంలో మాత్రం రోజుకు 100, 150 మట్టి కుండల అమ్మకాలు జరుగుతుంటాయి. అందుకే దిష్టిబొమ్మలు, దీపపు కుద్దులు అమ్ముతుంటాం. పెళ్లిళ్ల సీజన్‌లో కొబ్బరి బొండాలపై అలంకరణలు చేస్తుంటాం.

-రమణమ్మ, కుండల విక్రయదారు, శ్రీకాకుళం

ఈ పాత్రల వినియోగం మంచిదే..



పూర్వం మట్టికుండలోనే వంటలు వండుకొని వంద సంవత్సరాలు జీవించేవారు. వాటిలోని వంటల వల్ల ఆరోగ్యంగా ఉండేవారు. అప్పట్లో రోగాలు తక్కువగా ఉండేవి. మట్టికుండలో నీరు తాగడం వల్ల గొంతు నొప్పి, జలుబు వంటివి రావు. గ్యాస్ట్రిక్ వంటి సమస్యలు తలెత్తేవి కాదు. మట్టి కుండలు మాయమైన తర్వాత మనపై అనేక రకాల రోగాలు దాడి చేస్తున్నాయి.

-డాక్టర్ బొడ్డేపల్లి సురేష్, శ్రీకాకుళం

'చూచి'తిరా.. వైఫల్యం!

(ఐదో పేజీ తరువాయి)

సీసీ కెమెరాల చోరీ ఘటనలు విద్యావ్యవస్థకు మాయని మచ్చగా నిలిచాయి. వంద రోజుల ప్రణాళిక అంటూ విద్యాశాఖ అధికారులు కార్యాచరణ ప్రారంభించి.. తీరా పరీక్షల సమయానికి తుస్సు మనిపించారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యార్థుల భవితకు ముప్పు తప్పదన్న వాదనలు వినిపిస్తున్నాయి.

● పకడ్బందీ ఏర్పాట్లు చేసినా..

జిల్లావ్యాప్తంగా 149 కేంద్రాల్లో ఈ నెల 17 నుంచి పదోతరగతి పరీక్షలు జరుగుతున్నాయి. గత అనుభవాల దృష్ట్యా ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పేపర్ లీకేజీ, మాస్ కాపీయింగ్ నివారణపై ముందుగానే దృష్టి పెట్టింది. కలెక్టర్లు, ఎస్పీలు, డీఈవోలకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు అధికారులు సమస్యాత్మక కేంద్రాలు, అనుమానిత కేంద్రాల్లో సీసీ కెమెరాలు అమర్చారు. శ్రీకాకుళం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో కంట్రోల్‌రూమ్ సైతం ఏర్పాటు చేశారు. 149 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 149 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 2400 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. జిల్లా వ్యాప్తంగా 28,984 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఏర్పాట్ల పరంగా ఇబ్బందులు లేకున్నా.. ఎచ్చెర్ల మండలం కుప్పిలిలో చూచిరాతల ఘటన మాత్రం యావత్ జిల్లా విద్యాశాఖ, ఉపాధ్యాయవర్గాన్ని తలదించుకునేలా చేసింది. ట్రిపుల్ ఐటీలో సీట్ల కోసమే ఈ ఘటనకు ప్రోత్సహించారనే వాదన వినిపిస్తోంది.

● ట్రిపుల్ ఐటీ ఎంపిక కోసమే..

గత ఏడాది జిల్లాలో పదో తరగతి ఫలితాల్లో 93.35 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది కూడా అటువంటి మెరుగైన ఫలితాలు వస్తాయని విద్యాశాఖ అధికారులు అంచనా వేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదోతరగతి ఫలితాల్లో మార్కులు ఎక్కువగా తెచ్చుకుంటే ట్రిపుల్ ఐటీలో ఇంజనీరింగ్ సీటు ఉచితంగా దొరికే అవకాశం ఉంటుంది. దీంతో ఎక్కువ మంది ట్రిపుల్ ఐటీ వైపు మొగ్గుచూపుతున్నారు. ఏపీలో 4 ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ల్లో 4 వేల సీట్లను భర్తీ చేస్తారు. అయితే లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడుతుంటారు. ఈ నేపథ్యంలో పదో తరగతిలో ఎక్కువ మార్కులు పొందేందుకు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్టు తెలుస్తోంది.

● నాణ్యమైన ఫలితాల కోసం కృషి..

పదో తరగతి పరీక్షలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. వంద రోజుల ప్రణాళికను అమలు చేశాం. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకున్నాం. నాణ్యమైన ఫలితాల కోసం కృషి చేస్తున్నాం. కానీ ఇంతలోనే కుప్పిలి కేంద్రంలో చూచిరాతలు బయటపడ్డాయి. మాస్‌కాపీయింగ్‌కు సహకరించిన వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయి. ఉపాధ్యాయులు, అధికారులు బాధ్యతగా వ్యవహరించాలి.

-తిరుమల చైతన్య, డీఈవో, శ్రీకాకుళం

'రవాణా' భారం!

(ఐదో పేజీ తరువాయి)

సులభతరమైన సేవలు అందించేందుకుగాను..కేంద్ర ప్రభుత్వం ఆటోమేటిక్ టెస్టింగ్ స్టేషన్లు (ఏటీఎస్) ఏర్పాటు చేయాలని అన్నిరాష్ట్రాలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా రవాణా శాఖ కార్యాలయాల్లో ఉన్న ఫిట్‌నెస్ కేంద్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ జారీ కేంద్రాలు 63కుగాను 25కు కుదించారు. జిల్లాకు సంబంధించి ఇచ్ఛాపురంలో ఫిట్‌నెస్ కేంద్రాన్ని ఎత్తేశారు. దీనిని శ్రీకాకుళం రవాణాశాఖ కార్యాలయంలో విలీనం చేశారు. దీంతో వాహనదారులు, డ్రైవింగ్ లైసెన్స్‌లు అవసరమైన వారు ఇబ్బందులు పడుతున్నారు. ఇచ్ఛాపురంలోనే ఫిట్‌నెస్ పరీక్షల కేంద్రాన్ని కొనసాగించాలని ఇటీవల నిరసన చేపట్టారు. ఈ మేరకు ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే అశోక్‌తోపాటు ఎంవీఐకి వినతిపత్రాలు అందజేశారు. ఈ విధానంలో మార్పులు తీసుకురావాలని కోరారు.

ఇచ్ఛాపురంలోనే కొనసాగించాలి..

● నాకు ఆటో ఉంది. గతంలో ఇచ్ఛాపురంలో ఫిట్‌నెస్ కేంద్రం ఉండేది. చాలా సులభంగా పని జరిగేది. కానీ ఇప్పుడు శ్రీకాకుళం (ఎచ్చెర్ల) వెళ్లాలంటే రానూపోనూ దాదాపు 250 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. అనుకున్న సమయానికి ఫిట్‌నెస్ పరీక్షలు చేయలేకపోతున్నాం. ఇచ్ఛాపురంలో కేంద్రం కొనసాగించాలి.

-ఉలాసి ఎర్రయ్యరెడ్డి, ఆటో డ్రైవర్, ఇచ్ఛాపురం

● కేంద్రం ఎత్తివేత తగదు..

డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీ ప్రక్రియను ఎత్తివేయడం తగదు. గతంలో స్థానికం గానే ధ్రువపత్రాలను పొందేవారం. కానీ ఇప్పుడు శ్రీకాకుళం వెళ్లాల్సి వస్తోంది. చాలా ఇబ్బందులు పడుతున్నాం. అందుకే తిరిగి ఇచ్ఛాపురంలోనే కేంద్రం కొనసాగేలా చూడాలి.

-డి.లింగరాజురెడ్డి, ఆటోడ్రైవర్, ఇచ్ఛాపురం

పందెం కాస్తే.. పోతాయ్!

(ఐదో పేజీ తరువాయి)

చేసేందుకు వెనుకంజ వేస్తున్నారు. ఈ నేపథ్యంలో బెట్టింగ్ యాప్‌ల బారిన పడకుండా పోలీసులు చర్యలు చేపట్టాలని జిల్లావాసులు కోరుతున్నారు.

నిందితులపై కన్నేస్తే...

బెట్టింగ్ కేసుల్లో అరెస్టయిన నిందితులపై పోలీసులు ఓ కన్నేస్తే కొంతవరకైనా వీటికి అడ్డుకట్ట పడుతుంది. మధ్యవర్తులుగా వ్యవహరించే బుకీల కార్యకలాపాలపైనా దృష్టి సారించాలి. లోతుగా విచారిస్తే సూత్రధారులెవరో స్పష్టంగా తెలుస్తుంది. అవసరమైన పక్షంలో యాప్ నిర్వాహకులపైనా కేసులు నమోదు చేయాలి. కొన్ని రాష్ట్రాల్లో పోలీసులు ప్రస్తుతం ఈ వ్యవహారంపై ఉక్కుపాదం మోపుతున్నారు. బెట్టింగులను ప్రోత్సహిస్తున్న సామాజిక మాధ్యమాల ప్రభావశీలురపైనా చర్యలు తీసుకుంటున్నారు. ఇదేవిధంగా జిల్లాలోనూ కఠినంగా వ్యవహరించాలి.



'డ్రోన్'తో శివారు ప్రాంతాల్లో నిఘా

శ్రీకాకుళంక్రైం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): డ్రోన్ కెమెరాలతో నగర శివారు ప్రాంతాల్లో జరుగుతున్న చట్టవ్యతిరేక కార్యకలాపాలకు చెక్ పెడుతున్నట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని సిద్ధిపేట, టిడ్కో కాలనీ, పాత్రునివలస, తండేవలస ప్రాంతాల్లో శనివారం డ్రోన్ కెమెరాలతో పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ సందర్భంగా నిర్మానుష్య ప్రాంతాల్లో మద్యం తాగుతున్న వారిని గుర్తించి... పోలీసు స్టేషన్‌కు తరలించారు. వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

క్షయరహిత సమాజానికి కృషి చేయాలి

- డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ
- జిల్లాలో 3,428 కేసుల నమోదు

అరసవల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): క్షయరహిత సమాజానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ టీవీ బాలమురళీకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన శనివారం స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. క్షయ అంటువ్యాధి అని, ఇది గాలి ద్వారా ఇతరులకు వ్యాప్తి చెందుతుందని తెలిపారు. మైకో బాక్టీరియా ట్యూబర్క్యులోసిస్ అనే క్రిమి ద్వారా ఈ వ్యాధి సోకుతుందని తెలిపారు. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ప్రమాదం సంభవిస్తుందన్నారు. జిల్లాలో గతేడాది 3,854 కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో ఇప్పటివరకు 3,428 కేసులు నమోదైనట్టు తెలిపారు. సకాలంలో చికిత్స పొందాలని, లేకుంటే మందులకు కూడా లొంగని మొండి వ్యాధిగా మారుతుందని హెచ్చరించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, ఛాతీలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. సకాలంలో చికిత్స తీసుకుంటే వ్యాధి పూర్తిగా నయమవుదతుందన్నారు. క్షయవ్యాధిగ్రస్థులకు ఉచితంగా మందులు అందిస్తున్నట్టు తెలిపారు. క్షయవ్యాధి నివారణా దినోత్సవం సందర్భంగా సోమవారం ఉదయం 9 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ఏడురోడ్ల కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం వ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. వ్యాధిగ్రస్థులకు పోషకాహార పంపిణీ, దాతలకు సత్కారం ఉంటుందన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.శ్రీకాంత్, డీఐవో డాక్టర్ రాందాస్, డీపీఎంవో వాన సురేష్, డిప్యూటీ డెమో ఎం.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో బాలమురళీకృష్ణ

నగరంలో జాబ్‌మేళా రేపు

అరసవల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): యువతకు ఉపాధి కల్పించేందుకు ఈ నెల 24న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు డీఆర్డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ డీఎల్‌టీసీ/ఐటీఐ (శ్రీకాకుళం)లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఫ్యూజన్ ఫైనాన్స్ లిమిటెడ్‌లో రిలేషన్‌షిప్ ఆఫీసర్స్ - 50 పోస్టులు, జీతం రూ.15,000, వయస్సు 21-34 మధ్య, ఇంటర్ ఆపైన విద్యార్హత, నవత రోడ్డు ట్రాన్స్‌పోర్టులో క్లర్కు/ డ్రైవర్/ హెల్పర్లు పోస్టులు (130/220/320)లకు పురుష అభ్యర్థులు జీతం రూ.11,000 నుంచి 19,200 వరకు, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్ పోస్టులు 60, ఇంటర్ విద్యార్హత, వయస్సు 20 - 35 సంవత్సరాలు, జీతం రూ.17,500 ఉంటుందన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు రేషన్ కార్డు/ఆధార్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల జెరాక్స్ రెండు పాస్‌పోర్టు ఫొటోలు, బయోడేటాతో హాజరుకావాలని అన్నారు. వివరాలకు 8374633902 ఫోన్ నెంబరులో సంప్రదించాలన్నారు.

రైతులు భాగస్వాములు కావాలి

జి.సిగడాం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ సాగులో రైతులు భాగస్వాములు కావాలని రీజనల్ అధికారి హేమసుందర్ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి కేపీపీ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాహ్వానితుడు మీసాల వెంకటరమణ, ఎంపీడీవో జి.రామకృష్ణ, ఏపీఎం ఆర్.రామకృష్ణంనాయుడు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతోనే మండలాభివృద్ధి

లావేరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతోనే మండలాభివృద్ధి సాధిద్దామని ప్రత్యేకాహ్వానితులు రొక్కం బాలకృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో ఎంపీపీ లుట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో పి.వెంకటరాజు మాట్లాడుతూ.. రాబోయే వేసవిలో మండలంలో నీటి ఎద్దడి నివారణకు మండల పరిషత్ నిధులు రూ.5 లక్షలతో తాగునీటి బోర్లు పరికరాలను కొనుగోలు చేశామన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై అధికారులను పలువురు ప్రజాప్రతినిధులు నిలదీశారు. ఎక్సైజ్ ఎస్ఐ షర్మి, ఏవో మహేష్ నాయుడు, ఏపీవో ఆర్.సత్యవతి, ఈవో పీఆర్డీ విశ్వేశ్వరరావు, విద్యుత్‌శాఖ ఏఈ అప్పన్న, డీటీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కల్పించాలి

ఇచ్ఛాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మార్కెట్ (ఓఎన్‌డీఎస్) ద్వారా తమ ఉత్పత్తులు వ్యాపారం చేసుకునేలా ప్రతి సభ్యురాలికి అవగాహన కల్పించాలని ఏపీఎం ఎస్.ప్రసాద్ అన్నారు. శనివారం మండల మహిళా సమైఖ్య కార్యాలయంలో వీవోఏలతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతీ మహిళ హోమ్ కంపోస్టు, కిచెన్ గార్డెన్, ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం 2025-26 యాన్యువల్ క్రెడిట్ అండ్ లైవ్లీ హుడ్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ కె.రాము, సీసీలు లక్ష్మి, మోహన్‌రావు, 35మంది వీవోఏలు పాల్గొన్నారు.

అర్హులకు న్యాయం చేయండి

కవిటి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను అర్హులైన వారికి అందించి న్యాయం చేయాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. ఎంపీపీ కె.పద్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. పథకాలు అందరికీ అందించాలని అధికారులకు సూచించారు. రాజకీయాలతో ప్రమేయం లేకుండా అందరినీ కలుపుకొని వెళ్లాలన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై చర్చించారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ కె.మురళీమోహన్, ఏఈ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణంలో నిబంధనలు అతిక్రమణ

సోంపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పెట్రోల్ బంకు సమీపంలో నూతనంగా చేపట్టి భవనం నిర్మాణంలో నిబంధనల అతిక్రమణ జరిగిందని మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి కోర్టులో కేసు వేశారు. ఈ మేరకు బంకు సమీపంలో ఉన్న ఎస్.సత్యనారాయణ, ఎం.సోమేష్‌కి చెందిన భవనాన్ని ఉన్నతాధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సుడా అధికారి మాట్లాడుతూ.. భవన నిర్మాణం పూర్తిగా సుడా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారన్నారు. అంతేకాకుండా ఆర్అండ్‌బీ రహదారి 19అడుగుల ఆక్రమణ జరిగినట్టు గుర్తించామన్నారు. ఈ ఆక్రమణపై సంబంధిత అధికారులకు నివేదిస్తామన్నారు. మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు కూడా భవనం కింద నీరుపారే బట్టి ఉండేదని సుడా అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లారు. దీనిపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈయన వెంట సైట్ ఇంజనీర్ కె.మోహన్, ఈవో శాంతికుమారి, మాజీ ఎంపీపీ చిత్రాడ శ్రీనివాసరావు ఉన్నారు.

మట్టి టిప్పర్లు అడ్డగింత

సరుబుజ్జిలి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): అధికారపక్షం పేరు చెబితే మట్టి అడ్డగోలు దోపిడీకి అ ధికారులు కూడా అడ్డుచెప్పలేకపోతున్నారు. దీంతో పాలవలస, పురుషోత్తపురం రెవెన్యూ పరిధి నుంచి అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న టిప్పర్లను రావివలస జంక్షన్ వద్ద గ్రామస్థులు శనివారం అడ్డుకున్నారు. టిప్పర్లు భారీ లోడ్లతో అధిక వేగంతో ప్రయాణించడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయని, అనుమతులు లేకుండా ఎలా రవాణా చేస్తున్నారని డ్రై వర్లను ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, మైన్స్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిండడంలో ఆంతర్యమేంటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నేటి నుంచి పైడితల్లమ్మ జాతర

పొందూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల కల్పవల్లి పొందూరు పైడితల్లి అమ్మవారి యాత్ర మహోత్సవా లు ఆదివారం నుంచి ప్రారంభం కాను న్నాయి. మూడు రోజులపాటు యాత్రను నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ జాతరకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. పలు స్వచ్ఛంద సంస్థలు తాగు నీరు, మజ్జిగ పంపిణీ ఏర్పాట్లు చేశారు.

ప్రతి నీటిబొట్టూ సంరక్షిద్దాం

అరసవల్లి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జలమే జీవనాధారం.. ప్రతి నీటిబొట్టును రక్షించి భావితరాలకు అందిద్దామని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ జలదినోత్సవం సందర్భంగా స్థానిక అరసవల్లి రోడ్డులో గల ఇందిరా విజ్ఞాన్ భవన్‌లో ఆయన సభ్యులతో కలిసి శుక్రవారం పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. సమస్త జీవకోటికి ఆధారం జీవనాధారం నీరే.. అది లేనిదే ప్రాణికోటి మనుగడ లేదన్నారు. కార్యక్రమంలో దినేష్, శ్రావణ్‌కుమార్, మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటిక పోటీలు

శ్రీకాకుళం కల్చరల్, 22(ఆంధ్రజ్యోతి): సుమిత్ర కళా సమితి ఆధ్వర్యంలో శనివారం బాపూజీ కళామందిర్‌లో రెండో రోజు నిర్వహించిన జాతీయస్థాయి నాటిక పోటీలు అలరించాయి. కళాకారులు తమ నటనతో ఆహూతులను ఆలోచింజేశారు. పలు సందేశాత్మక నాటికలు కట్టిపడేశాయి. కార్యక్రమంలో గుత్తు చిన్నారావు, ఇప్పిలి శంకర్ శర్మ, గుత్తు చిన్నారావు, పులఖండం శ్రీనివాసరావు, నక్క శంకరరావు, పార్థసారథి, మెట్ట పోలినాయుడు, సురేష్ వరలక్ష్మి ఉషారాణి, పూజ, రాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

సారా అరికట్టేందుకు సహకరించండి

కంచిలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సారా అరికట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని ఎక్సైజ్ సీఐ కె.బేబీ కోరారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నవోదయం 2 కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సారా తయారీ, అక్రమ రవాణాపై దృష్టి సారిస్తూ, పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఎంపీడీవో వి.తిరుమలతరావు, ఎంపీపీ దేవదాస్ రెడ్డి, దత్తత గ్రామాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలు పెంపొందించాలి

గార, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాలు పెంపొందించేలా రైతులు ముందుకు రావాలని ఎమ్మెల్యే గొండు శంకర్ కోరారు. శనివారం అంపోలులో ఉపాధి పథకం ద్వారా ఏర్పాటు చేయనున్న ఫాంపాండ్స్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. నీటి కుంటలు ఏర్పాటు వల్ల పొలాల్లో భూగర్భ జలాలు పెరిగి పంటలకు ఎంతో మేలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీడీ లోకేష్, ఎంపీడీవో ఎస్.రామ్మోహనరావు, ఏపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

- రణస్థలం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పెంపొందించేందుకు రైతులు కృషి చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా శనివారం యాగాటపాలెం గ్రామానికి చెందిన ముసలయ్య పొలంలో నీటికుంటల నిర్మాణ కార్యక్రమానికి భూమి పూజ చేశారు. వర్షపు నీరు నిల్వ చేసేందుకు ఈ నీటి కుంటలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఈశ్వరరావు, ఈవోపీఆర్డీ ధనుంజయరావు, ఏపీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



రణస్థలం: భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్



గార: అంపోలులో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

లైంగిక వేధింపులకు కఠినశిక్ష



మాట్లాడుతున్న న్యాయాధికారి శ్రీనివాసరావు

సోంపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మైనర్లపై లైంగిక దాడులకు పాల్పడితే 12ఏళ్ల పైబడి శిక్ష పడుతుందని సీనియర్ సివిల్ న్యాయాధికారి జె.శ్రీనివాసరావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడారు. మైనర్లపై లైగింకదాడులు పాల్పడితే ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ సెక్సువల్ యాక్ట్ 2012 ప్రకారం 12 ఏళ్లపైబడి శిక్ష లేదా ఒక్కోసారి ఉరిశిక్ష కూడా పడుతుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో బి.శ్యామలమ్మ, న్యాయవాది జీఎస్ శైలేంద్ర, వెలుగు, మహిళా కార్యదర్శులు పాల్గొన్నారు.

చట్టానికి అందరూ సమానులే



పొందూరు: మాట్లాడుతున్న న్యాయాధికారి జ్యోత్స్న

పొందూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): చట్టం ముందు ధనిక, పేద తేడాలేకుండా అం దరూ సమానులేనని జూనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి బి.జ్యోత్స్న అన్నారు. మలకాం గ్రామంలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని గ్రామస్థులతో మాట్లాడారు. కేసుల కోసం న్యాయవాదులను నియమించుకోలేని పేదలకోసం న్యాయసేవాధికార సంస్థ ద్వారా సేవలు అందిస్తామన్నారు. ప్రతీఒక్కరికీ చట్టాలు, న్యాయవ్యవస్థపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.శ్రీనివాసరావు, న్యాయవాదులు కె.మంజుల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

సరుబుజ్జిలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులు పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలని ఆమదాలవలస కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఎస్.మణి తెలిపారు. వెన్నెలవలస వద్ద ఉన్న గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికారి ఆదేశాలు మేరకు బాలికలకు నిత్య జీవితంలో ఎదురవుతున్న లైంగిక వేధింపుల అంశంపై శనివారం అవగాహన కల్పించారు. లైంగిక వేధింపులు జరుగుతున్న వివరాలను అధికారులకు ధైర్యంగా తెలియజేయాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సమావేశంలో ఆశ్రమ పాఠశాల హెచ్ఎం బిడ్డిక ఉమ, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

29న సర్వసభ్య సమావేశం

రణస్థలం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సమావేశపు మందిరంలో ఎంపీపీ పిన్నింటి రజిని సాయి అధ్యక్షతన ఈనెల 29 మండల సర్వసభ్య సమావేశం జరగనుందని ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావాలని కోరారు.

రక్తదాన శిబిరం

సోంపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బారువ మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి పోలీసులతోపాటు ప్రజలు కూడా రక్తాన్ని దానం చేశారు. కార్యక్రమంలో మెరైన్ సీఐ రమేష్‌కుమార్, ఎస్ఐ శ్రీనివాస్, టెక్కలి మెడికల్ అధికారి బీ.సునీత తదితరులు ఉన్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

కంచిలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డు లబ్ధిదారులంతా ఈనెల 31వ తేదీలోగా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలు తప్పా తెలుపు, అంత్యోదయ, తదితర రేషన్‌కార్డులో ఉన్న లబ్ధిదారులంతా సచివాలయాలు, రేషన్ షాపులోని ఈపాస్ పరికరాల ద్వారా ఈకేవైసీ అప్‌డేట్ చేసుకోవాలన్నారు.

అందిపుచ్చుకోవాలి

ఆమదాలవలస, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో సాంకేతికను రైతులు అందిపుచ్చుకోవాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం రేవతి అన్నారు. శనివారం మండలంలోని చేపేనపేట గ్రామంలో డీపీఎం రేవతి ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో మిరప పంటపై వావిలాకు కషాయాన్ని డ్రోన్ సాయంతో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా డీపీఎం రేవతి మాట్లాడుతూ.. రైతులకు ప్రస్తుత రోజుల్లో కూలీల సమస్య ప్రధానంగా ఉందన్నారు.

ఆ వెంచర్‌కు అనుమతుల్లేవు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సోంపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సోంపేట నుంచి కవిటి వైపు వెళ్తున్న రహదారిలో ఎటువంటి అనుమతులు లేకుండా వెలసిన వెంచర్ విషయంలో 'రియల్ దగా' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఈ మేరకు సుడా బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పి.మోహన్, సైట్ ఇంజనీర్ కె.మోహన్ కలిసి వెంచర్ స్థలాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వెంచర్‌లో 22-ఏ భూములు ఉన్నాయని, అంతేకాకుండా నాలా ట్యాక్స్ కూడా కట్టలేదని, దీనికి ఎటువంటి అనుమతులు లేకుండానే రహదారులు వేశారని తెలిపారు. ఈ విషయంపై జాయింట్ కలెక్టర్‌కు నివేదిక ఇస్తున్నట్టు తెలిపారు.

ఏఐపై అవగాహన పెంపొందించుకోవాలి

ఎచ్చెర్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమైన ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ (ఏఐ)పై అవగాహన పెంపొందించుకోవాలని హెచ్ఎంఐ ఇంజనీరింగ్ సర్వీసెస్ (విశాఖ) సీఈవో దినేస్‌కుమార్ హిరావత్ అన్నారు. శివానీ ఇంజనీరింగ్ కళాశాల (చిలకపాలెం)లో విద్యార్థులకు ఎక్స్‌ప్లైనబుల్ అండ్ జనరేటివ్ ఏఐ అనే అంశంపై వారం రోజులుగా నిర్వహిస్తున్న వర్క్‌షాపు శనివారంతో ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ వై.శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ జీటీ చంద్రశేఖర్, సీఎస్ఈ విభాగాధిపతి జగదీష్‌కుమార్, పీడీ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల వైఖరివల్లే..

పొందూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో జిల్లా, రాష్ట్ర అధికారులు అవలంబిస్తున్న వైఖరి, వైఫల్యం, మితిమీరిన జోక్యమే 10వ పరీక్షల్లో మాస్‌కాపీయింగ్ (చూసిరాతలకు) కారణమవుతోందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరిప్రశన్న, పేడాడ కృష్ణారావు అన్నారు. శనివారం వారు తాడివలస జడ్పీ ఉన్నత పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. మాస్‌కాపీయింగ్‌తో తెలివైన విద్యార్థులకు అన్యాయం జరుగుతోందన్నారు.

ప్రైవేటు డిగ్రీ కళాశాలల కార్యవర్గం

ఎచ్చెర్ల, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో మెరుగైన విద్యను అందించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ఆ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన పొన్నాన జయరాం తెలిపారు. శ్రీకాకుళంలో శనివారం జిల్లా ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ ఎన్నిక జరిగింది. గౌరవాధ్యక్షుడిగా జామి భీమశంకరరావు, కార్యదర్శిగా కోత మురళీధర్, కోశాధికారిగా బి.చిట్టిబాబు, ఉపాధ్యక్షులుగా ముద్దాడ బాలభూపాలనాయుడు, మజ్జి పెంటన్నాయుడు, ఎన్ని దేవరాజు, సీహెచ్ తులసీదాస్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.నిరంజన్, దానేటి పద్మజ, ఎస్.మధుసూదన రావు, రెడ్డి గోపాల రావు, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా దుర్గాప్రసాద్, ఎ.శ్రీనివాస్, పి.గోపాలరావు, టి.విజయకుమార్, ఎన్నికయ్యారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

శ్రీకాకుళంఅర్బన్, మార్చి 22(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సిక్కోలే లక్ష్యంగా ప్రతీ ఒక్కరూ పని చేయాలని పారిశుధ్య కార్మికులకు నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు సూచించారు. ఖాజీపేటలో శనివారం సాయంత్రం పారిశుధ కార్మికులకు హెల్త్ ఆఫీసర్ డా.సుధీర్‌కుమార్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కమిషనర్ ప్రసాదరావు మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికులు ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని, ఎలక్ట్రికల్ వేస్ట్‌ను వేరుగా కలెక్ట్ చేయాలని తెలిపారు. నగరపాలక సిబ్బంది పారిశుధ్య కార్మికులు, శానిటేషన్, ఎన్విరాన్మెంట్ సెక్రటరీ, మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు.

బదిలీల చట్టంపై ఉపాధ్యాయుల హర్షం

ఇచ్ఛాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖలో విలీనం చేసే ప్రక్రియలో ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.84ను పూర్తిస్థాయిలో అమలు చేయాలని పురపాలక సంఘ ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరారు. అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని అన్ని పురపాలక ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నారన్న తప్పుడు సమాచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇలాంటి తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఉపాధ్యాయుల బదిలీల చట్టంలో మున్సిపల్ ఉపాధ్యాయులను కూడా చేర్చడంపై రాష్ట్ర వ్యాప్తంగా వివిధ మున్సిపాల్టీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు శనివారం హర్షం వ్యక్తం చేశారు. హెచ్ఎం రమణమ్మ, ఉపాధ్యాయులు గనణకుమారి, దామోదర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురంలో చిరుజల్లులు

ఇచ్ఛాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎండ తీవ్రతకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలకు శనివారం కురిసిన వానకు ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. గత వారం రోజులుగా ఎండ తీవ్రత ఎక్కువ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అరగంట పాటు కురిసిన వర్షానికి ప్రజలు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

7 కిలోల గంజాయితో ఇద్దరి అరెస్టు


మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటఅప్పారావు

పలాస, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పలాస రైల్వే స్టేషన్ వద్ద ఒడిశా రాష్ట్రం ఆర్.ఉదయగిరికి చెందిన గుల్సన్ ఆనంద్, మోజేష్‌కుమార్‌పాణి 7.8 కిలోల గంజాయి తరలిస్తుండగా శనివారం సీఐ పి.సూర్యనారాయణ సిబ్బందితో తనిఖీ చేసి పట్టుకుని అరెస్ట్ చేసినట్లు డీఎస్పీ వి.వెంకట అప్పారావు తెలిపారు. ఈ మేరకు ఆయన విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఆ మేరకు.. గుల్సన్‌ఆనంద్, మోజేష్ ఇద్దరూ స్నేహితులు. క్రికెట్ బెట్టింగ్‌లకు అలవాటు పడి డబ్బులు పోగొట్టుకున్నారు. ఏదోవిధంగా డబ్బులు సంపాదించి బెట్టింగ్‌లో కోల్పోయిన నగదు రికవరీ చేసుకోవాలనే ఆలోచనతో గంజాయి రవాణాను ఎంచుకున్నారు. ఒడిశాకి చెందిన బాయ్‌కుంట అనే వ్యక్తి పరిచయమయ్యాడు. తాను గంజాయిని చెన్నై, బెంగుళూరుకు తరలిస్తానని, తనకు సాయం చేస్తే నగదు ఇస్తామనడంతో వీరిద్దరూ అంగీకరించారు. 7.8 కిలోల గంజాయిని పలాస రైల్వే స్టేషన్ వద్ద శక్తి అనే వ్యక్తికి ఇచ్చేందుకు తరలిస్తూ పోలీసులకు పట్టుబడ్డారు. మొత్తం నలుగురిపై కేసులు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశామని, మిగిలిన వారి కోసం గాలిస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ


నుజ్జయిన ఆర్టీసీ బస్సు

లావేరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): తాళ్లవలస వద్ద జాతీయ రహదారిపై శనివారం పెనుప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం నుంచి రణస్థలం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు తాళవలస వద్ద ఆగింది. ఈ క్రమంలో వెనుక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు వెనుక భాగంగా దెబ్బతింది. అయితే అప్పటికే ఈ బస్సు మరమ్మతు కావడంతో ఆ సమయంలో బస్సులో డ్రైవర్ తప్ప ఎవరూ లేరు. లారీలో కూడా ఎడమ వైపు క్లీనర్ కూడా లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై లావేరు పోలీసులు కేసు నమోదు చేశారు.

25 సారా ప్యాకెట్లు స్వాధీనం

ఇచ్ఛాపురం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న సారా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ పి.దుర్గాప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం కొజ్జిరి యా జంక్షన్ వద్ద తనిఖీలు చేస్తుండగా స్కూటీ డిక్కీలో ఉన్న 25 సారా ప్యాకెట్లు గుర్తించామన్నారు. దీంతో వాహనం సీజ్ చేయడంతో పాటు శంభూ శంకర్ రెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

స్వగ్రామానికి చేరుకున్న మత్స్యకారుడి మృతదేహం


రామారావు (ఫైల్)

సంతబొమ్మాళి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సౌదీ అరేబియాలో గత నెల 23న మృతి చెందిన ఎం.మరువాడకు చెందిన కొవిరి రామారావు(47) మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకొంది. రామారావు ఉపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లి కడుపునొప్పితో బాధపడుతూ మృతి చెందిన విషయం తెలిసిందే. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేం దుకు కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, పార్లమెంటరీ పార్టీ కార్యదర్శి నౌపడ సత్యనారాయణ చొరవతీసుకున్నారు. విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న మృతదేహం కేంద్రమంత్రి ఆదేశాల మేరకు ప్రత్యేక అంబులెన్స్ లో గ్రామానికి తీసుకువచ్చి శనివారం అంత్యక్రియలు చేశారు.

ప్లాస్టిక్ కర్మాగారంలో అగ్నిప్రమాదం



చెలరేగుతున్న మంటలు

జి.సిగడాం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సంతవురిటి వద్దగల శ్రీరామా ప్లాస్టిక్ కర్మాగారంలో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదం విద్యుత్‌షార్టు సర్క్యూట్ వల్ల జరిగిందని బాధితులు తెలి పారు. కర్మా గారంలో ఉన్న ముడి సరుకు, మిషనరీతో పాటు షెడ్ కూడా పూర్తిగా కాలి బూడిదైంది. కర్మాగార యజమాని దేవయాని ఇచ్చిన సమాచారం మేరకు పొందూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకోని మంటలను అదుపుచేశారు. ఆస్తి నష్టం సుమారు రూ.20 లక్షలు ఉంటుందని ప్రాథమిక అంచనా. తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు బత్తుల దేవయాని, బత్తుల రాంబాబు కోరారు.

పంచాయతీలకు అధికారాలివ్వని సమావేశాలెందుకు?

కోటబొమ్మాళి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): పంచాయతీలకు అధికారాలివ్వని సమావేశాలు ఎందుకని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రోణంకి ఉమ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దుబ్బ వెంకటరావు, ఎంపీపీ రోణంకి ఉమా, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజామణి, మండల విప్ బొడ్డు అప్పన్న మాట్లాడుతూ.. పంచాయతీల్లో పనులకు అంచనాలు తయారు చేయడం లేదని, అభివృద్ధికి సహకరించడం లేదని, దీనికి నిరసనగా బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తీర్మానంచేసి ఎంపీడీవో ఫణీంద్ర కుమార్‌కు అందించారు. ప్రజలతో ఎన్నుకైన ప్రజాప్రతినిధులను కూటమి ప్రభుత్వం ఉత్సవ విగ్రహాలుగా మార్చిందని విమర్శించారు.

జాబ్‌మేళాలో 67 మంది ఎంపిక


క్యాంపస్ ఇంటర్వ్యూలో ఎంపికైన అభ్యర్థులు, కంపెనీల ప్రతినిధులు

నరసన్నపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో డిగ్రీ కళాశాలల సౌజన్యంతో జ్ఞానజ్యోతి డిగ్రీకళాశాలలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 67 మంది ఎంపికయ్యారు. ఈ మేరకు వారికి నియామక పత్రా లను బహుళ జాతి కంపెనీ హెచ్‌ఆర్‌లు అందజేశారు. ఎంపికైన వారిలో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల విద్యార్థులున్నారు. శ్రీసిటీలో నాలుగు కంపెనీలు, హైదరాబాద్‌లో ఒక కంపెనీలకు వీరు ఎంపిక య్యా రు. పెక్సీకాన్, బ్లూస్టార్, ఎన్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్ కంపెనీ, కోలోగేట్, డైకాన్ కంపెనీల ప్రతి నిధులు బాలకుమార్, మురళీ, శంకర్, చంద్రబాబు ఇంటర్వ్యూలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల మేనేజ్‌మెంట్ సభ్యులు ఎస్.రుక్మాంగధరరావు, వరుదు ప్రవీణ, ప్రిన్సిపాల్ చింతు కృష్ణారావు తదిరతులు పాల్గొన్నారు.

ఘనంగా జలదినోత్సవం

పోలాకి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పాఠశాలల్లో శనివారం ప్రపంచ జలదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మెట్ట కొండమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరందించాలి

● మంత్రి అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శనివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లోని 497 గ్రామాలకు కుళాయిల ద్వారా తాగునీరందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. అందు లో భాగంగా రూ.97 కోట్లు మంజూరై నందున పనులు పూర్తి చేసేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గంలోని నీటి పథకాలు, వాటి పరిస్థితిని అధికారు లను అడిగి తెలుసుకున్నారు. తాగు నీటి సమస్య ఉన్న గ్రామాలను గుర్తించి నీటి సమస్య లేకుండా చూడాలని, అవసర మైతే బోర్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భాషా, రామకృష్ణ, పీఏసీస్ మాజీ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు. ● ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించడంలో అధికా రులు శ్రద్ధ తీసుకోవాలని మంత్రి కింజరాపు అచ్చె న్నాయుడు అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరిం చారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు సమస్యలు విన్నవించుకున్నారు.


వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు: ఎమ్మెల్యే బగ్గు

నరసన్నపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఎంపీడీవో కార్యాలయ సమావేశ మంది రంలో శనివారం ఎంపీపీ ఆరంగి మురళీధర్ అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామా ల అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా ప్రజాప్రతినిధులు పని చేయాలన్నారు. నరసన్నపేట పట్టణంలో రూ.2 కోట్లతో సీసీ రోడ్లు వేశామన్నారు. కార్యక్ర మంలో ఎంపీడీవో బి.మధుసూదనరావు, తహసీల్దార్ సత్యనారాయణ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతరశాఖ అధికారులు పాల్గొన్నారు. ● విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు తల్లిదండ్రు లకు అవగాహన కలిగించాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సూచించారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో క్లస్టర్ హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ లావణ్య, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, ఎం ఈ వోలు దాలినాయుడు, శాంతారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

పంట సంజీవినితో ప్రయోజనం

పోలాకి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో పంట సంజీవిని నీటి కుంటల ఏర్పాటుతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందని, ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. శనివారం ఆయన దీర్ఘాశిలో పంట సంజీవిని నీటి కుంటను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎంపీడీఓ గరిమెళ్ల రవికుమార్, ఏపీఎం రమణ నాయకులు బగ్గు అర్చన, ఎంవీనాయుడు, పల్లి సూరిబాబు, బైరి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

ఐక్యంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దాం

● ఎమ్మెల్యే గౌతు శిరీష


వజ్రపుకొత్తూరు: ప్రజాదర్బార్‌లో మాట్లాడుతున్న గౌతు శిరీష

వజ్రపుకొత్తూరు, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చిన్న విభేదాలను వీడి ఐక్యంగా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. టీడీపీ కార్యా లయంలో శనివారం ప్రజాదర్బార్ నిర్వహించి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వైసీపీ హయాంలో అప్పటి మంత్రి అప్పలరాజు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయకుండా ప్రచార ఆర్భాటం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల ఉపాధ్యక్షుడు అర్సవెల్లి ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కర్ని రమణ, నేతలు విఠల్, గొరకల వసంతరావు, బుల్లోజు శశిభూషణ్ తదితరులు పాల్గొన్నారు. ● మండలంలో చేపడుతున్న ఉపాధి పనులను వేతనదారులు వినియోగించు కోవాలని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం చినవంక పంచా యతీ తాడివాడలో ఉపాధి పనులను ప్రారంభించారు. ఎంపీడీవో ఎన్.రమేష్ నాయుడు, ఏపీవో అరుణ్‌కుమార్, నాయకులు సూరాడ మోహనరావు, దువ్వాడ హేంబాబుచౌదరి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపై వినతులు

హరిపురం మార్చి22 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వివిధ సమస్యలపై వచ్చిన వినతులను ఎమ్మెల్యే గౌతు శిరీష శనివారం స్వీకరించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా 120 వినతులు రాగా వాటిలో ఎక్కువగా రెవెన్యూ సమస్యలపై ఉన్నాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం సంక్షేమంతో పాటు అభివృద్ధి చేపడుతోందని, ఇందులో భాగంగా పనులు ఊపందు కున్నాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రట్టి లింగరాజు, బైరిశెట్టి గున్నయ్య తదితరులు పాల్గొన్నారు. అలాగే మఖరజోల గ్రామంలో నీటి కుంట ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. జిల్లాలో వెయ్యి ఫాం పాండ్ల నిర్మాణం లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నా రన్నారు. కార్యక్రమంలో ఏపీవో హరికృష్ణ, సురేష్‌వర్మ, టీడీపీ నాయకులు జీకే నాయుడు, దాసరి తాతారావు, పుల్లా వాసు, బమ్మిడి కర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత పత్రికలో నాపై అభాండాలు

● మానసికంగా వేధించడంతోనే కోర్టుకు..

● ఎమ్మెల్యే గౌతు శిరీష

పలాస, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తన సొంత పత్రికలో లేనిపోని అభాండాలు వేసి తనను, తన కుటుంబాన్ని వ్యక్తిగతంగా టార్గెట్ చేసి వార్తలు రాయించి మానసికంగా వేధించారని, దీనిని గుర్తించి కోర్టు ఆ పత్రికకు రూ.2 లక్షలు జరిమానా విధించిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శనివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. తనపై నిందలు వేసి సోషల్‌మీడియాలో విస్తృత ప్రచారం చేసిన 'ప్రజాగళం-మనచిక్కోలు' పత్రిక యజమాని సీహెచ్ జగదీశ్వరరావుకు విశాఖపట్నం కోర్టు ఈ జరిమానా విధించిందన్నారు. పత్రికా విలువలను కాలరాసి నోటికి వచ్చిన విధంగా అబద్ధాలు సృష్టించి వార్తలు రాశారని, దీనివల్ల తాను మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నానన్నారు. తనపై సామాజిక తిరుగుబాటు అనే పేరుపెట్టి ఎన్నికల ముందు వార్తలు వైసీపీ పత్రికలో వార్తలు రాశారని, ప్రజల్లో తిరుగుబాటు వచ్చింది కనుకే తనకు 40వేలు పైచిలుకు ఓట్లతో గెలిపించారని ఆమె పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

కొసమాల సర్పంచ్ చెక్‌పవర్ రద్దు

మెళియాపుట్టి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): కొసమాల సర్పంచ్ ఊర్లాన రవికుమార్ చెక్‌పవర్ మూడునెలల పాటు తాత్కాలికంగా రద్దు చేసినట్లు డీపీవో నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఎంపీడీవో ప్రసాద్ పండా తెలిపారు. పంచాయతీ నిధులు దుర్వినియోగంపై కొందరు గ్రామస్థులు ఫిర్యాదుచేశారు. టెక్కలి డీఎల్పీవో విచారణ చేపట్టి డీపీవోకి నివేదిక అందించారు. ఈ మేరకు సర్పంచ్ అక్రమాలకు పాల్పడినట్లు రుజువు కావడంతో చెక్ పవర్‌ను తాత్కాలికంగా రద్దు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారని ఎంపీడీవో తెలిపారు.

ఏడీఈగా సురేష్

నరసన్నపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట ఈపీడీసీఎల్ ఏడీఈగా బొడ్డేపల్లి వెంకట సురేష్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈయన కోటబొమ్మాళి నుంచి పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. ఇక్కడ ఏడీఈగా పనిచేస్తున్న ఇందిరను శ్రీకాకుళం ఆపరేషన్ విభాగానికి బదిలీ చేశారు. సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నట్లు సురేష్ తెలిపారు.

ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రం

హరిపురం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): మందస ఆసుపత్రి ఆవరణలో వైద్యులు మద్దిల సంపతిరావు ఆధ్వ ర్యంలో శనివారం పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. ఆవరణలోని పిచ్చి మొక్కలు తొలగించారు. స్వచ్ఛ ఆంధ్రలో ఆసుపత్రిని శుభ్రపరుస్తామన్నారు. కార్యక్రమంలో కృష్ణారావు, హేమలత, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పలాసరూరల్,మార్చి22(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 11 కేవీ చినబాడం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ స్కీమ్‌లో కొత్త విద్యుత్ స్తంభాలు వేసేందుకుగాను ఆదివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామని ఈఈ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు పెంటిభద్ర, జయరామచంద్రపురం, నర్సిపురం, నీలాపురం, రైల్వేగేట్ డౌన్, పెసరపాడు, అంతరకుడ్డ, రాజపురం తదితర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

వసపను వీడిన ఏనుగులు

కొత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): గడచిన 10 రోజులుగా వసప తోటల్లో తిష్ట వేసిన ఏనుగులు శనివారం పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం కీసర గ్రామంవైపు వెళ్లాయి. దీంతో వసప, కుంటిభద్ర గ్రామాల రైతులు ఊపిరిపీల్చుకున్నారు. తంపర భూముల్లో వేసిన తోటలకు వెళ్లి ఎవరెవరివి ఏ మేరకు నష్టం వాటిల్లాయో చూశారు. రెవెన్యూ, అటవీ శాఖాధికారులు పంటల నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించి న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు.

'పది' పరీక్ష కేంద్రాల పరిశీలన

పలాస, మార్చి 22(ఆంధ్రజ్యోతి): పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కాశీబుగ్గ జడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న పదో తరగతి పరీక్షలను రాష్ట్ర పరిశీలకుడు వీఎస్ మస్తానయ్య శనివారం పరిశీలించారు. పరీక్ష హాలుకు వెళ్లి తాగునీరు, మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉన్నారా లేదా పరిశీలించారు. మాస్ కాపీయింగ్ జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని, పరీక్ష హాళ్ల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో పలాస, సోంపేట ఎంఈవోలు సత్యం, కృష్ణంరాజు, హెచ్‌ఎంలు చిన్నంనాయుడు, చిట్టిబాబు, తారకరామారావు పాల్గొన్నారు.

ఈకేవైసీని పూర్తి చేయాలి

టెక్కలి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులందరి ఈకేవైసీ పూర్తి చేయాలని తహసీల్దార్ కల్యాణ చక్రవర్తి ఆదేశించారు. ఈ మేరకు శనివారం తన కార్యాలయంలో వీఆర్వోలు, రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 31లోగా ఈకేవైసీ పూర్తిచేయాలని, లేకుంటే ఏప్రిల్ రేషన్ ఇవ్వడం జరగదన్నారు. లబ్ధిదారులు ఆధార్, రేషన్ కార్డులను డీలర్ వద్దకు తీసుకువెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని, ఈ దిశగా వారికి అవగాహన కలిగించాలన్నారు.

బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలి: డీఎస్పీ

కాశీబుగ్గ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని, మీ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా బెట్టింగ్ నిర్వహిస్తే తెలియజేయాలని కాశీబుగ్గ డీఎస్పీ వెంకట అప్పారావు అన్నారు. శనివారం పలాస ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి కాశీబుగ్గ శ్రీనివాసలాడ్జి వరకు గ్రీన్‌ఆర్మీ సంస్థ ఆధ్వర్యంలో బెట్టింగ్, లోన్ యాప్స్‌కు వ్యతిరేకంగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బెట్టింగ్, లోన్ యాప్‌ల వల్ల యువత అప్పుల పాలై నేరాలు చేసి ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వీటి వల్ల బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారని, అందువల్ల వీటికి అలవాటు ఎడవద్దన్నారు. ఎవరైనా బెట్టింగ్‌లకు పాల్పడితే కఠిన మైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు గోపాల్, ప్రజా సంఘ నాయకులు వేణుగోపాల్, దిలీప్, గణపతి, వినోద్, అజయ్‌కుమార్, సూర్య నారాయణ, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్‌జైలును సందర్శించిన న్యాయాధికారి


సూచనలిస్తున్న న్యాయాధికారులు

పాతపట్నం, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ జైలును జిల్లా మూడవ అదనపు న్యాయాధికారి వివేకానంద శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. సబ్‌జైలు రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. మెనూ నిర్వహణ, ఖైదీల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, న్యాయవాది జి.ఫల్గుణరావు, జైలు సూపరింటెండెంట్ జి.రాము పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి


మాట్లాడుతున్న సివిల్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ

నరసన్నపేట, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సివిల్ కోర్టు న్యాయాధికారి హరిప్రియ అన్నారు. శనివారం స్థానిక బాలికల సంక్షేమ వసతిగృహంలో అవగాహన సదస్సు నిర్వహించారు. పోక్సో చట్టం, బాలికల హక్కుల చట్టం తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో జీవీవీజీ నాయుడు, జె.కామేశ్వరరావు, టి.సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్ అవర్‌పై అవగాహన కలిగి ఉండాలి

పలాసరూరల్/పాతపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఎర్త్ అవర్‌పై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని, పర్యావరణ సమతుల్యత, భూతాపాన్ని తగ్గించేందుకు కృషి చేయాలని ఉపాధ్యాయులు సూచించారు. ప్రపంచ భూదినోత్సవాన్ని శనివారం బ్రాహ్మణతర్లా, పాతపట్నం ఉన్నత పాఠశాలల్లో నిర్వహించారు. బ్రాహ్మణతర్లాలో విద్యార్థులు బల్బు ఆకారంలో మానవహారం చేశారు. పాతపట్నంలో కొవ్వొత్తులు పట్టుకుని ప్రదర్శన చేశారు. విద్యుత్ పొదుపుతో భూతాపాన్ని కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు ఎస్వీ రమణ, ఎస్.వైకుంఠరావు, ఎన్‌జీసీ క్లస్టర్ కో ఆర్డినేటర్ కె.శ్రీనివాసరావు, గ్రీన్ టీచర్ రామారావు పాల్గొన్నారు.

నేడు సినీనటుడు నారాయణమూర్తి రాక

నరసన్నపేట, మార్చి 22(ఆంధ్రజ్యోతి): సినీనటుడు, పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణమూర్తి ఆదివారం నరసన్నపేట రానున్నారు. విప్లవవీరుడు మామిడి అప్పలసూరి వర్ధంతిని పురస్కరించుకుని కోమర్తి గ్రామంలోని అమరవీరుల స్మారక స్థూపం వద్ద నివాళి అర్పించనున్నారు. మామిడి అప్పలసూరి శ్రీకాకుళం రైతాంగ ఉద్యమంలో పేదల భూమి కోసం, భుక్తికోసం పోరాటం చేసి అనేకమార్లు జైలుశిక్ష అనుభవించారు. నక్సలైట్ నాయకులు కోరన్న, మంగన్న, పంచాది కృష్ణమూర్తి, ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యం అడుగుజాడల్లో నడుస్తూ పలు ఉద్యమాల్లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో ఆయన చేసిన పోరాటం తదితర వృత్తాంతాలతో ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు 'మండే సూరీడు' పేరుతో రాసిన పుస్తకాన్ని సినీనటుడు నారాయణమూర్తి ఆవిష్కరించనున్నారు.

నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యం: ఎంజీఆర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, మార్చి 22(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ సమగ్రాభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో రోడ్లు, వసతిగృహాల నిర్మాణం, తాగు నీటి సరఫరా తదితర అభివృద్ధి పనుల కోసం రూ.400 కోట్లు మంజూరు చేయించామన్నారు. రానున్న కాలంలో గిరిజన గూడల్లో డోలీ మోతలు లేకుండా చర్యలు తీసు కుంటున్నామన్నారు. ప్రతీ గ్రామానికి రోడ్లు నిర్మిస్తామన్నారు. ఐటీడీఏ ఏర్పాటుతో గిరిపుత్రల అభివృద్ధి, జీవనోపాధి పెంపుదల, ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్దానం ఫేజ్-2కు సుమారు రూ.260 కోట్లు నిధులు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దీంతో గ్రామాలలో తాగునీటి సమస్య తీరనుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సలాన మోహనరావు, పైల బాబ్జీ, మెండ మనోహర్, ఒమ్మి ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి: ఆర్డీవో


కల్వర్టును పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి, పోర్టు జీఎం శంకర్

సంతబొమ్మాళి, మార్చి 22(ఆంధ్రజ్యోతి): వచ్చే ఖరీఫ్ సీజన్‌లో వరద ముంపు లేకుండా రైతులకు ఇబ్బం దులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పోర్టు అధికారులకు సూచించారు. మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టుకు టెక్కలి నుంచి నిర్మిస్తున్న రోడ్డులో భాగంగా విష్ణుచక్రం గ్రామం వద్ద నిర్మిస్తున్న కల్వర్టు వల్ల తంపర పంట పొలాలు ముంపునకు గురవుతాయని మండల రైతులు మంత్రి అచ్చెన్నాయుడుకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన ఆదేశాల మేరకు ఆర్డీవో సదరు ప్రదేశాన్ని పోర్టు అధికారులతో కలిసి పరిశీలించారు. కల్వర్టు నిర్మాణం చేపట్టడం వల్ల వర్షాకాలంలో వరద నీటితో వరి పంట పొలాలు ముంపునకు గురై నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని కాకరాపల్లి సర్పంచ్ పల్లి జోగారవు, రైతుల ప్రతినిధి కోత మధుసూదనరావు, మత్స్యకార ప్రతినిధి హనూరావు ఆర్డీవో దృష్టికి తీసుకువెళ్లారు. అనంతరం పోర్టు నిర్వాసితుల ఆర్‌అండ్‌ఆర్ కాలనీని పరిశీలించి రోడ్డు, విద్యుత్ నీటి సరఫరా ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మూలపేట పోర్టు జీఎం శంకర్, డీటీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ జాతరకు మునిసిపల్ నిధులా?

● సమావేశంలో సభ్యుల ఆవేదన


సమావేశంలో మాట్లాడుతున్న దువ్వాడ శ్రీకాంత్

పలాస, మార్చి 22(ఆంధ్రజ్యోతి): జామి ఎల్లమ్మ జాతరకు మునిసిపల్ నిధులు ఖర్చు చేయడం ఏమిటని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తంచేశారు. శనివారం మునిసిపల్ సమావేశ మందిరంలో చైర్మన్ బళ్ల గిరిబాబు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు దుర్గాశంకర్‌పండా, పప్పల ప్రసాద రావు, గుజ్జు జోగారావు, పిచ్చుక అజయ్ మాట్లాడుతూ.. ఎల్లమ్మ జాతరకు గుర్తింపు లేని కమిటీ వేసుకొని భారీగా భక్తుల నుంచి వసూలు చేశారని, వారి వద్ద నుంచి ఎంత వసూలైందో బహిరంగ రహస్యమన్నారు. అటువంటప్పుడు మునిసిపాలిటీ నుంచి జాతర కు ఎందుకు ఖర్చు చేయాల్సి వచ్చిందని ప్రశ్నించారు. రూ.3 లక్షల వరకు ఖర్చు చేసినట్లు అజెండాలో పెట్టారని, ఈ మొత్తం ఎక్కడ ఖర్చు చేశారో తెలియజేయాలన్నారు. వైసీపీ సభ్యులంతా దీన్ని వ్యతిరేకిస్తున్నామని చైర్మన్ బళ్ల గిరిబాబుకు డిసెంట్ తెలిపారు. కమిషనర్ ఎన్.రామారావు స్పందిస్తూ.. జాతర రాష్ట్రస్థాయి పండగ మాదిరిగా జరుగుతుందని, భారీ సంఖ్యలో భక్తులు వస్తారని పోలీసు ఇంటలిజెన్స్ నివేదిక ఆధారంగా తాము రంగంలోకి దిగాల్సి వచ్చిందన్నారు. భక్తులకు ప్రసాదాలతో నగర సుందరీకరణకు విద్యుత్‌దీపాలతో అలంకరించామన్నారు. చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ యాత్ర నిర్వహణలో లోపాలు కనిపి స్తున్నాయని, ప్రైవేటు వ్యక్తులు నిర్వ హించే పండగకు మున్సిపల్ నిధులు ఖర్చు చేయాల్సిన అవసరం లేకపోయినా భారీ సంఖ్యలో ప్రజలు తరలివస్తారని, నగర సుంద రీకరణ జరగకపోతే అప్రతిష్ఠ వస్తుందనే ముం దస్తు అనుమతులివ్వడం జరిగిందన్నారు. దు వ్వాడ శ్రీకాంత్ మాట్లాడుతూ జాతర నిర్వహణ సక్రమంగా లేదని, మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడితే ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. వీఐపీ పాసుల పేరుతో కౌన్సిలర్లను అవమానపరిచారన్నారు. ఉద్దానం రక్షిత నీటిని పలాస-కాశీబుగ్గకు తీసుకు వచ్చేందుకు నిర్ణయించడం శుభపరిణామమని, దీనికి కృషి చేసిన ఎమ్మెల్యే గౌతు శిరీషకు పాలకమండలి తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నామని శ్రీకాంత్ అన్నారు. అంతకు ముందు బడ్జెట్ సమావేశం నిర్వహించి ఆమోదించారు. ఇదిలా ఉండగా ప్లాస్టిక్‌ను నిషేధించడంలో భాగంగా సమావేశంలో సభ్యులందరికీ స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ బాటిళ్లను అందించారు.

'ఉపాధి'లో అక్రమాలు

కొత్తూరు, మార్చి 22(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. గ్రామాల్లో చేపట్టిన ఉపాధి పనుల్లో రూ.4 లక్షల మే అక్రమాలు జరిగి నట్లు డీఆర్పీలు ప్రకటించారు. డ్వామా పీడీ సుధాకరరావు చివరలో వచ్చి సమావేశంలో జరిగిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.